క్లుప్తంగా

ఆర్థిక సాయం



శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన ఎండీ. షర్ఫుద్దీన్ అనారోగ్యంతో మృతి చెందాడు. షర్ఫుద్దీన్ నిరుపేద కుటుంబానికి చెందగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు అతని ఇల్లు కూలిపోవడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ గ్రామశాఖ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయాన్ని అందజేసినట్లు తెలిపారు. అందజేసిన వారిలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వేముల రమేష్, మాజీ సర్పంచ్ పోతు కృష్ణమూర్తి, నాయకులు శానం కుమారస్వామి, సప్పిడి నాగరాజు, కత్తుల లక్ష్మణ్, రమేష్, సాంబయ్య ఉన్నారు.

శివాలయం పునఃప్రతిష్ఠ ముహూర్తం ఖరారు



ఆత్మకూరు : మండల కేంద్రంలో భక్తుల సంపూర్ణ సహకారంతో పునర్నిర్మాణం అయిన మహాదేవ పంచకూట శివాలయం పునఃప్రతిష్ఠ ముహూర్తం ఖరారైంది. నవంబర్ 8న ఆలయ ప్రతిష్ఠ జరుగుతుందని వేదపండితులు శివశంకర్ శర్మ బుధవారం తెలిపారు. నవంబర్ 6,7,8 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రతిష్ఠకు భక్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పూజారి రవీందర్‌శర్మ, వంగాల బుచ్చిరెడ్డి, తోట రఘు, సిరిపురం సంపత్, బూర కిషోర్, రేవూరి దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాషబోయిన సాగర్, ఉప్పుల సుదర్శన్, మందల తిరుపతిరెడ్డి, శివప్రసాద్, బాదం వెంకటేశ్వర్లు, పోలు రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రు సేవలు వెలకట్టలేనివి



దామెర: మండలంలోని తక్కళ్లపహాడ్ పాఠశాలలో పార్ట్‌టైమ్ స్వీపర్‌గా పనిచేసిన రామచంద్రు సేవలు వెలకట్టలేనివని ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు తెలిపారు. పాఠశాలలో 32 ఏళ్ల పాటు పార్ట్‌టైమ్ స్వీపర్‌గా రామచంద్రు పనిచేసి పదవీ విరమణ పొందారు. బుధవారం రామచంద్రు దంపతులను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం నర్సింగరావు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు సేవలందించిన రాంచంద్రు సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సంధ్య మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా విద్యార్థులకు సేవలందించిన రామచంద్రుకు ప్రభుత్వం తరపున ఎలాంటి బెనిఫిట్స్ మంజూరు కాకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, రమాదేవి, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నడికూడ: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీకేంద్రం– 2 టీచర్ పూర్ణ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ ఆన్ గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు స్టాడియో మీటర్‌తో పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నది లేనిది తల్లిదండ్రులకు తెలిపారు. కొలమానం ద్వారా పిల్లల ఎదుగుదల గురించి తెలుసుకొని పోషణ లోపాన్ని ముందే గుర్తించడం, త్వరిత చర్య, సలహాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కేయూ భూములను పరిరక్షించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఏబీవీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూలో బుధవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొక్కుబడిగా ఈజీఎస్ ప్రజావేదిక



ఇంకుడు గుంతలకు బిల్లులు చెల్లించాలని డీఆర్‌డీఓ నాగపద్మజకు విన్నవిస్తున్న వార్డు మాజీ సభ్యులు



పంచాయతీ కార్యదర్శుల, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ నాగపద్మజ

- తనిఖీలో నివేదికలు వెల్లడించిన టీం సభ్యులు
- ఉపాధి పనుల వద్ద ఏర్పాటు చేయని నేమ్ బోర్డ్స్
- ఏడాది మొక్కలు ఉంటేనే బిల్లులు చెల్లించాలి
- డీఆర్డీఓ నాగపద్మజ

శాయంపేట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మొక్కుబడిగా కొనసాగింది. మండలంలోని 24 గ్రామాల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు రూ. 3.87 కోట్ల నిధులతో జరిగిన ఉపాధి పనులపై 15వ విడత సామాజిక తనిఖీ టీం సభ్యులు ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 3 వరకు గ్రామాల్లో తనిఖీ నిర్వహించారు. గ్రామసభలలో బుధవారం జరిగిన ఓపెన్ ఫోరంలో తుది నివేదికను వెల్లడించారు. ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఓ కె.నాగపద్మజ, ప్లాంటేషన్ మేనేజర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ నాగరాజు, క్యూసీ పి.శ్రీనివాస్, డీటీసీ ఈసీ శ్రీధర్‌రావు, ఏఎంపీ డీపీసీ ఎస్.సాగరిక, ఎంపీడీఓ ఫణిచంద్ర పాల్గొనగా సామాజిక తనిఖీ టీం సభ్యులు గ్రామాల వారిగా నివేదికలను వెల్లడించారు. పెద్దకోడెపాకలో 962 మునగచెట్లకు 700 మొక్కలు చనిపోయాయని వీటికి రూ. 32,988 ఖర్చు అయినట్లు తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే మొక్కలను నాటించాలని డీఆర్‌డీఓ తెలిపారు. మొక్కలు ఏడాది పాటు ఉంటేనే రైతులకు డబ్బులు చెల్లింపు చేయాలని సూచించారు. గ్రామంలో ఆదివారం కూడా పనులు చేసినట్లు రికార్డులో ఉందని గ్రామసభలో కూలీలు పనిచేసినట్లు రాసి ఇచ్చారని రుగురు కూలీలు పని చేయలేదని పేమెంట్ అయిందని తెలుపగా కూలీల నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. సాధోనిపల్లె గ్రామ నర్సరీలో 18 వేల మొక్కలు పెంపకం చేపట్టగా 11వేల మొక్కలు ఫారెస్ట్ అధికారులకు పంపిణీ చేశామని చెబుతున్నారని, రికార్డులో చూపెట్టడం లేదని వెల్లడించారు. రికార్డులనే చూపించాలని ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శులను డీఆర్‌డీఓ ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని, రికార్డులను సరిగా రాయలేదన్నారు. మస్టర్‌లో కొట్టివేతలు ఉన్నాయని టీం సభ్యులు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ప్రజావేదిక కొనసాగింది. శాయంపేటకు చెందిన మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వసంత, గొట్టిముక్కుల చక్రపాణిలు తాము 2019లో అధికారుల ఆదేశాల మేరకు ఇంకుడు గుంతలు తవ్వించామని కొన్నింటికి బిల్లులు రాగా మరికొన్నింటికి రావాల్సి ఉందని చెప్పారు. పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నామని, మూడు ప్రజావేదికలో వినతిపత్రాలు సమర్పించామని అయినప్పటికీ తమకు బిల్లులు చెల్లింపులు జరుగలేదని ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రజుమంలో సోషల్ ఆడిట్ ఎస్‌టీఎం సాయి జ్ఞానేందర్, డీఆర్పీలు నాగరాజు, రజిత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో రూ. 28,947 జరిమానాలు

ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి పనులపై జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ. 28,947 జరిమానాను డీఆర్డీఓ కె.నాగపద్మజ విధించారు. శాయంపేట, పెద్దకోడెపాక, సాదోనిపల్లె, ప్రగతిసింగారం, తహరాపూర్ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ. 6,108 జరిమానా విధించారు. ప్రగతి సింగారం, కొత్తగట్టు సింగారం, సూర్యనాయక్ తండా, మైలారం, జోగంపల్లి గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.7,220, నూర్జహాన్‌పల్లి, కొప్పుల, కాట్రపల్లి, పత్తిపాక, రాజుపల్లి, గోవిందాపూర్ గ్రామాల కార్యదర్శులకు రూ.15,619 జరిమానా విధించారు. మొత్తం రూ.28,947 జరిమానాను విధించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ప్రణవ్

కమలాపూర్: కమలాపూర్, వంగపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)నుంచి మంజూరైన చెక్కులను బుధవారం కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ పంపిణీ చేశారు. కమలాపూర్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ మౌటం రమేష్‌బాబు, వెలిశెట్టి చంద్రయ్య, మండలంలోని వంగపల్లి మాజీ సర్పంచ్ పంజాల సారయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఒడితల ప్రణవ్ హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ తవుటం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేశిని ఐలయ్యగౌడ్, నాయకులు కొండ తిరుపతిగౌడ్, విజ్జిగిరి దేవేందర్, గూడెపు మొగిలయ్య, ఎండీ.అంజద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపూజోత్సవం

హనుమకొండ జిల్లాలో 31 మంది టీచర్లకు ఉత్తమ అవార్డులు

విద్యారణ్యపురి: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాలో 31మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఉత్తములుగా ఎంపిక చేసినట్లు డీఈఓ డి.వాసంతి బుధవారం తెలిపారు. అందులో 28మంది ప్రభుత్వ యజమాన్యాల పాఠశాలల నుంచి కాగా, మరో ముగ్గురు ప్రైవేటు హైస్కూళ్ల నుంచి ఎంపిక చేశారు. వారందరికి గురువారం సాయంత్రం 3గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని డీఈఓ తెలిపారు.

ఎంపికైనవారు వీరే..

ఎం.వేణు ఆనంద్ (జెడ్పీహెచ్‌ఎస్ రాంపూర్, కాజీపేట), కె.హనుమంతరావు (జెడ్పీహెచ్‌ఎస్ నడికుడ), ఎ.రాజేందర్ (జెడ్పీహెచ్‌ఎస్ ఉప్పల్, కమలాపూర్), ఎ.రవి (జెడ్పీహెచ్‌ఎస్ అక్కంపేట, ఆత్మకూరు), కె.శ్రీనివాస్ (జెడ్పీహెచ్‌ఎస్, గట్ల నర్సింగాపూర్), పి.సిలినా (జెడ్పీహెచ్‌ఎస్, వెంకటాపూర్), ప్రత్యూష (జీహెచ్‌ఎస్, వడ్డెపల్లి), డి.రమేష్ (జెడ్పీహెచ్‌ఎస్, నీరుకుళ్ల, ఆత్మకూరు), బి.అశోక్ కుమార్ (జెడ్పీహెచ్‌ఎస్, గట్ల నర్సింగాపూర్), ఎస్.వేణుగోపాల్‌రావు (జెడ్పీహెచ్‌ఎస్, పీచర), పి.రవి (జెడ్పీహెచ్‌ఎస్, పెద్దకోడెపాక), బి.శిరీష (జెడ్పీహెచ్‌ఎస్, ఉప్పల్), డి.భిక్షపతి (జీహెచ్‌ఎస్, హనుమకొండ), ఆర్.వెంకటేష్ (ఎంపీయూపీఎస్, జగన్నాథపురం), జి.సుదర్శన్ (ఎంపీయూపీఎస్, పోచారం), బి.లత (ఎంపీయూపీఎస్, లక్ష్మీపురం), ఎం.శ్రీధర్ (ఎంపీపీఎస్, వరికోలు), ఎం.భిక్షపతి (ఎంపీపీఎస్, కంఠాత్మకూర్), ఎస్.శ్రీదేవి (ఎంపీపీఎస్, నార్లాపూర్), వి.రఘు (ఎంపీపీఎస్, పెద్దకోడెపాక), ఆర్.భిక్షపతి (ఎంపీపీఎస్, ఆత్మకూరు, గొల్లవాడ), జె.పుష్పలత (ఎంపీపీఎస్, ఆత్మకూరు), ఎన్.ప్రవీణ్‌కుమార్ (ఎంపీపీఎస్, లోక్యాతండా), ఎం.రాధిక (ఎంపీపీఎస్, ఎర్రబెల్లి), ఎ.జ్యోతి (ఎంపీపీఎస్, ముప్పారం), జి.ఉషారాణి (ఎంపీపీఎస్, పెద్దాపూర్), పి.సత్యనారాయణ రెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్, మడికొండ), డి.నాగయ్య (జెడ్పీహెచ్‌ఎస్, పరకాల), టి.బుచ్చిబాబు (భారతీయ విద్యాభవన్ హైస్కూల్, హనుమకొండ), వి.మధుకర్ (మేధా కాన్సెప్ట్ స్కూల్, బాపూజీ నగర్, కాజీపేట), కె.అపర్ణ (విద్యాదరి హైస్కూల్, గోపాల్‌పూర్, హనుమకొండ).

మండలంలో యథేచ్ఛగా రేషన్‌దందా

- షాపుల వద్దే కాపుకాస్తున్న బియ్యం వ్యాపారులు
- కూలీలను నియమించి మరీ కొనుగోలు
- పట్టించుకోని అధికారులు



అక్రమంగా టాటాఏస్ వాహనంలో తరలిస్తున్న రేషన్‌బియ్యం

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. కొంత మంది దళారులు రేషన్‌డీలర్లతో కుమ్మక్కై షాపుల వద్దే దళారులకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం వ్యాపారులు కూలీలను నియమించుకొని దుకాణాల దగ్గర, ఇళ్ల వద్దకు వచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల వద్ద కిలోకు రూ.12కు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. గ్రామాల్లోని కొంతమంది వ్యాపారులు బియ్యం సేకరించి నిల్వచేస్తుండగా వీరి నుంచి బడా వ్యాపారులు గుత్తగా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. బియ్యం సేకరించే కూలీలకు కిలోకు కొంత కమీషన్ లేదా నెలజీతం ఇచ్చి బియ్యం సేకరించడానికి నియమించుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని కోళ్లఫాంలు, రైస్ మిల్లర్లకు, ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో బియ్యం అక్రమంగా నిల్వ ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు

కమలాపూర్: మండలంలోని వంగపల్లి శివారులోని ఓ పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నగదు, నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.27,490 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పారిపోయినట్లు తెలిపారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం ఇద్దరు పేకాటరాయుళ్లతో పాటు పట్టుబడిన నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లను కమలాపూర్ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు, ఆర్‌ఎస్సై భానుప్రకాష్, స్థానిక ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

హసన్‌పర్తి: 55వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నీటి నక్షత్రకాలనీ, బాలాజీ కాలనీల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నడికూడ: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం అని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిరికొండ అనూహ్య అన్నారు. హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి ఆదేశాల మేరకు మండలంలోని చౌటుపర్తిలో గత ఐదు రోజుల నుంచి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అనూహ్య మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులతో పాటు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నా రు. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని తాగాలని, అప్పుడే వ్యాధులకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రేణుక, హెల్త్ అసిస్టెంట్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



దామెర: అనారోగ్యంతో బాధపడుతున్న, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మహబూబాబాద్ మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ బుధవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన కదం రవి గతకొంత కాలంగా బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో నగేష్ గాయపడ్డాడు. మండల పర్యటనలో భాగంగా బాధితులను బుధవారం సీతారాంనాయక్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆర్థికసాయం అందించారు. మండలంలోని ల్యాదెళ్లకు చెందిన దండె శ్రీనివాస్ తండ్రి కట్టయ్య మృతి చెందాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్ ఉన్నారు.

ఎమ్మెల్యే సారూ.. మా గోడును పట్టించుకోండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- కరెంట్ లేక చీకట్లో భయంగా గడుపుతున్నాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరికి గోడును వివరించిన విద్యార్థినులు
- ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలో సమస్యలు వెలుగులోకి..

పరకాల: ఒకవైపు శిథిలమైన భవనాలు..మరోవైపు కరెంట్ పోతే జనరేటర్ పనిచేయకపోవడంతో విషపురుగుల భయంతో చీకట్లో భయంగా గడుపుతున్నామంటూ పరకాల మల్లక్కపేట సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి తమ గోడును విన్నవించుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పరిసరాలతో పాటు డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మీడియాను అనుమతిస్తే ఎక్కడ విద్యార్థినులు సమస్యలను బయటపెడుతారోనని గేట్ వద్ద అడ్డుకునే రెసిడెన్షియ ప్రిన్సిపాల్, సిబ్బంది ఎమ్మెల్యే రేవూరి ఆకస్మిక తనిఖీతో కంగారుపడుతూ కనిపించారు. అయినప్పటికీ విద్యార్థినులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీటికోసం చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం పడితే స్కూల్ ఆవరణమంతా బురదమయంగా మారుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులను అసహించుకోకుండా ప్రేమతో విద్యాబుద్ధులు నేర్పాలని హాస్టల్ నిర్వహకులకు హితవు పలికారు. విద్యార్థినీలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించే విషయంలో రాజీపడవద్దని ప్రిన్సిపాల్ కృష్ణకుమారిని ఆయన ఆదేశించారు. మెనూ తప్పకుండా పాటించాలని సూచించిన ఆయన విద్యార్థులకు అందించే ఆహారపు పదార్థాలకు సంబంధిత వస్తువులపై నాణ్యత ప్రమాణాలు ఉన్నాయా లేదా తప్పకుండా చూసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పరకాల ఆర్డీఓ కె.నారాయణ, తహసీల్దార్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని వెంటనే నియమించాలి

ఐనవోలు: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పూర్తి కాలపు అధ్యక్షుడిని జాతీయ నాయకత్వం వెంటనే నియమించాలని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ జాయింట్ కో ఆర్డినేటర్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణలో 9 నెలలుగా పూర్తి కాలపు పీసీసీ అధ్యక్షుడు లేకపోవడంతో పార్టీ కార్యక్రమాలు కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉంటూ చురుకుగా పనిచేస్తున్నారు. వరదల వల్ల నష్టం కలిగిన బాధితులను కలుస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇదే సమయంలో ఫుల్ టైం పీసీసీ అధ్యక్షుడు ఉంటే పార్టీ కార్యకర్తలను కదిలిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చేయగలుగుతారన్నారు. కార్యకర్తలను ఉత్తేజ పరచడం, విస్తరించడం జరిగినపుడే పార్టీ పునర్వైభవం పొందుతుందన్నారు. చురుకుగా పనిచేసే ఫుల్ టైం అధ్యక్షుడిని నియమించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌లను విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటలు



వరదనీరు చేరి దెబ్బతిన్న పత్తి పంట

ఆత్మకూరు : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. పత్తి పంటల్లో నీరు చేరడంతో కాయలు రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే వాగుల సమీపంలోని వరిపొలాలు నీట మునిగాయి. విస్తారంగా కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. మండలంలోని కటాక్షపూర్ చెరువు బుధవారం కూడా మత్తడి పడింది.

కాయలు రాలిపోయాయి..

భారీ వర్షాలకు పత్తిపంట దెబ్బతిన్నది. కాయలు రాలిపోయాయి. వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు శ్రీనివాస్ కోరాడు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఇన్నారెడ్డి

ధర్మసాగర్ : మండలంలోని మల్లక్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు బుధవారం రెవరెండ్ ఫాదర్ ఆర్.ఇన్నారెడ్డి రూ.40 వేల విలువ చేసే వస్తువులు, నోట్‌బుక్స్, కంపాస్ బాక్సులు, టీ షర్ట్స్, బెల్ట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వి.నాగేశ్వరీ మాట్లాడుతూ డబ్బులు అందరి దగ్గర ఉంటాయని కానీ సహాయం చేయాలనే భావన కలిగి ఉండాలన్నారు. ఈ మేరకు దాత ఫాదర్ ఇన్నారెడ్డిని అభినందించారు. దాత ఇన్నారెడ్డి మాట్లాడుతూ భగవంతుడు నాకు ఇచ్చినటువంటి ఆర్థికపరమైన వెసులుబాటు ద్వారా సహాయం చేయకల్గుతున్నానని తెలిపారు. నాకు స్ఫూర్తి ప్రదాతలు అబ్దుల్ కలాం, మదర్‌థెరిస్సా అని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధరాచారి, రాధిక, సోమశేఖర్, ప్రేమ్‌రెడ్డి, రాజమహ్మద్, నవీన్ కుమార్, వినయ్ కుమార్, రజిత, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పునాదులకే పరిమితం



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తొలగించి ఆ స్థలంలో హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణం ప్రారంభించారు. ఏడాది దాటినా పునాదులకే పరిమితమైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– ఆత్మకూరు

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : రత్నాకర్, ఏఈ, హెల్త్ డిపార్ట్‌మెంట్
ఫోన్‌నంబర్ : 99898 95017